# స్వార్థం బలి కోరింది

-వెలివల సాంబశివరావు



అర్ధరాత్రి!

మద్దెల దరువులా ఫోన్!

కాస్తంత నిశితంగా ఆలకిస్తే అది అరణ్యంలో శరణ్యాం లేక ఒక చిన్నది రోదన చేసినట్టుగా వున్నది.

ఏం లాభం. ఎవ్వరు ఆదుకొంటారు. అదీ ఆ విధంగా వున్నది.

చెవిటి వాడి దగ్గర శంఖం వూదినట్లుగా వున్నది.

దాని పని అది చేసుకుపోతూనేవున్నది. ఓపిక వున్నంతసేపు గిలగిలమంటూ కొట్టుకొని ప్రాణం పోయిన చేపపిల్లలా "ఫోను" ఆగిపోయింది.

మొండిప్రాణం అంత తేలిగ్గా పోదన్నట్లు, మళ్ళీ మోగటం ప్రారంభించింది ఫోన్.

ఈ సారి ఇవతలవున్న శరీరానికి మగత వదిలినట్లుగా, అవలిస్తూ బద్ధకంగా లేస్తూ రిసీవరు అందుకున్నాడు.

అవతలి కంఠం "సెల్‌ఫోన్"లో దిక్కుతోచని పక్షిలా

బిక్కుబిక్కు మన్నట్టుగా వుంది. ఏదో బాధ, భయం, జంటగా వంతపలుకుతున్నాయి.

అంత రాత్రిలోనూ శరగోపానికి, ఫారిన్ విస్కీ మత్తు దిగిపోసాగింది. మనస్సులో తీయని ఆవేదన చెలరేగింది. ఎందుకో గుండెలు లబలబ కొట్టుకోసాగాయి.

"అలాగే... అలాగే... నేనే రిసీవ్ చేసుకుంటాం" అంటూ ఫోన్ పెట్టేశాడో లేక, అతని నిద్రమత్తులో ఆ రిసీవరే జారి క్రింద పడిందో, మొత్తానికి ఆ తర్వాత మాటలు ఆగిపోయాయి.

★ ★ ★

కంపెనీ "గెస్టుహౌస్" మరీ గందరగోళంగా వుంది. టేబుల్ మీద పెట్టిన ఫారిన్, విస్కీ, రమ్, బ్రాందీ సీసాలు మాంత్రికులు మాయం చేసినట్లు ఖాళీ అవుతున్నాయి. కాస్లీ సిగరెట్లు పరుశురామ ప్రీతి అవుతున్నాయి. చికెన్, బిర్యానీలు కలుగల్లోకి పరుగులు తీసే ఎలుకల్లా కడుపులోకి దౌడు తీస్తున్నాయి.

ఆ ప్రదేశంలో రాక్షసులు మాంస భక్షన చేస్తున్నట్లుగా వుంది. అలాగే సురాపానం

కొనసాగుతూవుంది.

నాగరాజు ఆజ్మాయిషీ చేస్తున్నాడు. వాడు 'బాస్'కు కుడిఎడమ భుజాలేగాదు, గుండెకూడా అతన్ని చూసి నౌకర్లు చాకర్లు పులిని చూసిన జింకపిల్లలా భయపడుతూనే పనులను చేసుకుపోతున్నారు. అరేంజిమెంట్స్‌కు అధికారులు విస్తుపోయారు. కుర్చీల్లో కూర్చొని ఒకరు, కూర్చోకుండా మరొకళ్ళు, తాను కోర్చొని, తన మీద కుర్చీని వేసుకొని, "ఈ కుర్చీ కూర్చోటానికి చాలా సౌకర్యంగా వుందిగదూ, సుందర్రావు" అన్నాడతను. దానికి,

"నువ్వు కుర్చీలో కూర్చోలేదు, సోఫాలో పడుకున్నావ్ శంకర్రావ్" అన్నాడు సుందర్రావు.

అందంగా మహదానంగా విందును అరగిస్తున్నారు వాళ్ళు. మందును సేవిస్తున్నారు. వాళ్ళను రాక్షసులలాగా అక్కడ వున్న మందీ మార్బాలం చూస్తున్నారు. ఇంకేదో కొరవైంది అన్నట్లు, కావాలన్నట్లు అధికారులు సైగలు చేసారు. ఆ తర్వాత కేకలు వేసారు.

వాళ్ళేం కావాలంటున్నారో నాగరాజు చీకటిలో పసికట్టాడు. "బాబు! మందు, విందు ముగించారు. ఇక మిగిలింది పొందే గదా! అందుకోసం పరువాల చిన్నది ప్రక్కగదిలో వేచి వున్నది." అంటూ వాళ్ళను నడిపించుకుంటూ అక్కడికి తీసుకెళ్ళి వదిలిపెట్టాడు.

చీకటి పోకముందే గెస్టుహౌస్‌కి వచ్చిన 'బాస్'ని రిసీవ్ చేసుకున్నాడు నాగరాజు.

వచ్చిన విజిలెన్స్ అధికారులకు తాను ఏ విధంగా మర్యాదలు చేసింది, అందుకు వాళ్ళు మెచ్చుకొని, కంపెనీ మీద ఏ విధమైన అవకతవకలు లేనట్లు, గోడవున్లలో నిల్వవున్న సరుకంతా సక్రమమే అయిందని, నకిలీవి కావని, అందులో కల్తీమందులేవనట్లు, అకౌంట్సు అన్నీ సరిగ్గానే వున్నాయని రిజిష్టర్లలో వ్రాసి వెళ్ళిపోయారని చెప్పారు.

'మందు, విందు, పొందు' అన్నీ సరిగ్గానే యేర్పాటు చేసావుగదా" మళ్ళీ ప్రత్యేకంగా అడిగాడు బాస్ శఠగోపం.

"అయ్యా! ఎన్నో యేండ్లుగా తమ ఉప్పు పులుసు తింటున్న వాడికి ఆ మాత్రం విశ్వాసం లేకుండా ఎట్లా చేస్తాడు ఈ నమ్మినబంటు నాగరాజు." అంటూ విశ్వాసంతో మెలికలు తిరిగిపోతూ చెప్పాడు.

అతని విశ్వాసానికి 'బాస్' ప్రతిసారి మురిసిపోతూనే వుంటాడు. నాగరాజు అంత యిదిగా వుండబట్టే శఠగోపం కోట్లు సంపాదించగలిగాడు. అన్నివిధాల అతనే క్లిష్టమైన పరిస్థితుల్ని కూడా చక్కబరుచుతూ వుండేవాడు. నాగరాజు ఆ విధంగా ఆదుకుంటున్నప్పటికి, తనకంటూ ఏమీకావాలని అడిగేవాడుకూడా కాదు. ఇచ్చిందేదో ముచ్చటపడి తీసుకునేవాడు. ఆనందించేవాడు.

నాగరాజు ఆ విధంగా పనులను చక్కబరుస్తాడు కాబట్టి, ఆరోజున తన ఇండస్ట్రీస్ మీద విజిలెన్స్ అధికారులు దాడి చేసినప్పటికి, ఏమీ పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వున్నాడు శఠగోపం. అందుకే ఆదమరచి హాయిగా ఇంట్లో నిద్రపోయాడు. అదంతా ఆలోచించుకుంటే, నాగరాజు, తన స్వార్థానికి ఏవిధంగా వుపయోగించు కున్నది శఠగోపానికి బాగా అర్థమై తనలోతానే నవ్వుకున్నాడు. అంతలోనే అతని ఆలోచనలో మరో రకమైన మార్పువచ్చింది. "ఒకరు భాగ్యమంతులు కావాలంటే మరొకరు బలిపశువు కాక తప్పదు" అని, తన తాత చెప్పిన మాట ఆక్షణంలో శఠగోపం చెవ్వుల్లో గీతోపదేశం చేసింది.

"అదీ నిజమే! ప్రస్తుతం కొనసాగుతున్న సిద్ధాంతం కూడా అదేనేమో" అని ప్రశ్నకు తానే జవాబు చెప్పుకున్నాడు."

అదంతా నాగరాజు గమనిస్తూనే వున్నాడు.

"అయ్యగారేదో ఆలోచనలో వున్నట్టున్నారు..." అన్నాడు నాగరాజు మహాసౌమ్యంగా. అతని మాటలు బహు రమ్యంగా వినిపించాయి శఠగోపంకు.

"నువ్వు నన్ను అన్నివిధాల కనిపెట్టుకునే వుంటున్నావు... నాగూ... ఒక్కమాటలో చెప్పాలంటే నేను కోట్లు సంపాదించటానికి నువ్వేకారణం. నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను..." అన్నాడు శఠగోపం కావాలనే.

"దాందేముందిలే అయ్యా...! అనుకోని సంఘటనొకటి జరిగిపోయింది"అన్నాడు నాగరాజు.

నాగరాజు ఎంతటి విషమ పరిస్థితిలోనైనా, భయపడే ప్రసక్తిలేదు. అతను ఆ విధంగా బెరుగ్గావున్నందుకు శఠగోపం అతనివంక ఆసక్తిగా, రవ్వంత భయంగానూ చూసాడు.

"రాత్రి మనవాళ్ళు ఆ అధికారులకోసం పట్టుకొచ్చిన పిట్ట గిలగిలమంటూ తన్నుకొని చచ్చిపోయింది." మామూలుగా చెప్పాడు నాగరాజు.

"చచ్చిపోయిందా?" రక్తంలో మార్పువచ్చినట్టు 'స్టన్' అయ్యి, ఆ తర్వాత 'షేక్' అయినట్టు అరిచినంతగా అడిగాడు శఠగోపం.

"అదేంటయ్యా! తమరెప్పుడూ అలా ఇదికాలేదు. ఈ రోజున అంతగా బెంబేలుపడి పోయారేంటయ్యా?" నివ్వెరపోతూ అడిగాడు నాగరాజు.

"పద శవాన్ని చూద్దాం" అంటూ ముందుకు సాగాడు శఠగోపం.

"ఆ శవం గుర్తుపట్టటానికి వీల్లేకుండా, ముఖం గీక్కుపోయి, కాళ్ళు, చేతులూ డోక్కుపోయి వున్నాయి. మన అదృష్టం బాగుండి 'చార్‌మినార్' ఎక్స్‌ప్రెస్ నుండి దిగిన ఆ అందాల చిలకను, మన జగ్గూ, గంగులు పట్టుకొచ్చారయ్యా" అన్నాడు నాగరాజు.

"చార్‌మినార్ ఎక్స్‌ప్రెస్ నుండా!" ఆదుర్దాగా అడిగాడు శఠగోపం.

"అవునయ్యా..." అంటూ శఠగోపంతో పాటు నాగరాజు నిర్ఘాంతపోయాడు. శఠగోపం ఆ శవం వున్నగదిలోకి పరుగుతీసాడు. శవాన్ని చూచాడు. ఆ ఆకారాన్ని పోల్చుకున్నాడు. అప్పుడు గుర్తు తెచ్చుకున్నాడు. తనని స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకోమంటే "...అలాగే నేనే వచ్చి రిసీవ్ చేసుకుంటానని చెప్పింది. ఆ తర్వాత తాను నిద్రమత్తులోకి జారిపోయింది. శఠగోపానికి బాగా గుర్తువచ్చాయి. నాగరాజు ఏదో అడుగుతున్నాడు గాని, ఆ మాటలు శఠగోపానికి వినిపించటం లేదు. లోకమే కనిపించటం లేదు. నోట్లో నుండి మాట బైటకు రావటంలేదు. ఎలా చెప్పగలుగుతాడు. ఆ చార్‌మినార్ ఎక్స్‌ప్రెస్ నుండి దిగింది పెళ్ళిగాని తన చెల్లెలు సరోజానని, తన స్వార్థానికి బలై పోయిందని చెప్పలేడు. అయ్యగారు ఎందుకలా కుప్పకూలిపోయాడో, విషయం అర్థంగాక నిలువుగుడ్లేసుకుని చూస్తూవుండిపోయాడు నాగరాజు.

❃

## టెన్షను



పిచ్చుకొట్టుడు సుధాకర్ ఈరోజు చాలా సేఫ్టీగా ఆర్టిస్ట్. ప్రతి నటుడికీ అంతో ఇంతో టెన్షనుంటుంది కానీ, సుధాకర్‌కి మాత్రం అస్సలు టెన్షను వుండదంటాడు. ఏం! ఎందుకు టెన్షనుండదు? అని అడిగితే? నేను కామేడియన్‌ని అయిన తరవాత ప్రతి విషయాన్నీ కామెడీగా తీసుకోవడం మొదలుపెట్టాను. నా దృష్టంతా ఈరోజు ఎంతమందికి కాల్షీట్స్ ఇచ్చాను. అంతమంది దగ్గర్నుంచి సొమ్ము వసూళ్ళయిందో లేదో తెలుసుకోవడం... కాస్తో... కూస్తో... టెన్షనంటూ పడితే అపుడే పడతాను - అంటాడు పిచ్చుకొట్టుడు సుధాకర్.

- సాయిరాం